1936

# దుర్వ్యసనం

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు



"నాకిప్పుడు అత్యవసరంగా పదిహేను రూపాయలు కావాలి," అన్నాడు మా శివానందం.

"నాదగ్గిర లేవు ఫో!" అని నే నన్నాను.

మావాడు మండిపడి, "నిన్ను నే నిప్పుడు డబ్బు అడగటంలేదు. నీ డబ్బు నాకు విషంతో సమానం... నాలో నేను డబ్బు కావాలి అనుకున్నాను. తప్పా?" అన్నాడు.

"తప్పులేదు—లోపలే అనుకుంటే."

"లోపలే అనుకుంటే నీ కెట్లా తెలియటం?"

"నాకు తెలియకపోతే ఏం?"

"ఇయ్యకపోతే మానె, ఇచ్చేవాడినన్నా చూపించు."

ఎక్కడో అక్కడ డబ్బు పుట్టిస్తేనేగాని వాడు నన్ను వదిలేటట్టు కనపడలేదు.

"నీ దగ్గిర ఏమయినా డబ్బున్నదిటే పిల్లదానా?" అని నేను నా భార్యను అడిగాను.

"ఉంది. ఎంత కావాలి?" అన్నది మా ఆవిడ.

"పదిహేను!"

"పదిహేనే? ఏం చేస్తారూ?"

"మీ అన్నకు కావాలట!"

"నా దగ్గిర దమ్మిడీలేదు," అని నాభార్య ఖచ్చితంగా అంది. మా శివానందం రచ్చగెలిచి ఇంట గెలవని ఘటం.

సరే, ఇద్దరమూ డబ్బిచ్చే వాడికోసరం వెతుకుతూ బయలుదేరాము. సాయంకాలం నాలుగు అగాయతు రాత్రి ఏడున్నర దాకా [illegible] తిరిగాం. తిరిగి తిరిగి మా యిద్దరి కాళ్లూ పడిపోయిన వన్నమాట. ఎక్కడా డబ్బు పుట్టలేదు. వందమందినైనా అడిగి ఉంటాను నోరు చేసుకుని! ఇందులో మరొక విశేషం ఏమిటంటే, నా స్నేహితులు కనపడితే నేను అడగవచ్చునుటగాని, మావాడి స్నేహితులను వాడు అడగరాదట. అదివాడి గౌరవహానికి హేతువుట!

కాళ్లీడ్చుకుంటూ ఏడున్నరకు మేమిద్దరమూ ఇంటిదారి పట్టాం. మా సుబ్రహ్మణ్యం గారింటి మీదిగా వస్తుండగా నా కొక ఆలోచన తట్టింది—వాణ్ణికూడా ఎందుకు అడిగి చూడకూడదు?



సుబ్రహ్మణ్యం అంటే మా చెల్లెలి బావగారు, సామాన్యంగా డబ్బు దగ్గిర కాస్త ఇదిగా ఉండేమనిషి. అయితేనేం? ఆరోజు తెల్లవారి లేచి ఎంత మందిచేత నేను "లేదు" అనిపించుకోలేదు?

గొంతెత్తి "సుబ్రహ్మణ్యం!" అని పిలిచాను.

"ఓయ్! ఎవరువారు! రండి లోపలికి!" అని మహా ఉత్సాహంతో సుబ్రహ్మణ్యం లోపలినించి పిలిచాడు. నేనూ మావాడూ లోపలికి నడిచాం. గదిలో సుబ్రహ్మణ్యం భార్యతో చాలా సంతోషంగా, అమిత బిగ్గిరిగా అస్పష్టమైన సంభాషణ జరుపుతున్నాతు. మా చెల్లెలి తోడికోడలు సుభద్ర, మొగుడి వంక అమిత కోపంతో చురచురా చూస్తున్నది.

"హల్...లో! వీరు ఎవరు? షి-శివానందగారా? రండి, రండి, రండి!" అని మమ్మల్ని గోడల మీదికి ఆహ్వానించి సుబ్రహ్మణ్యం భార్యతో, "వీడు ఎవరో తెలుసునా? నీసోదరుడను కో! నీసోదరుడు!" అన్నాడు నన్ను చూపిస్తూ.

సుబ్రహ్మణ్యం బుడ్డీవేసి వచ్చాడని అప్పుడే గ్రహించగలిగాను. ఇదీ ఒకందుకు మేలే అయింది. ఇప్పుడు సుబ్రహ్మణ్యం కంటె దాన కర్ణుడు ఉండబోడు.

నేను మెల్లిగా వాడిభుజంతట్టి "ఒరే, సుబ్రహ్మణ్యం! నీతో ఒక రహస్యమైన పని ఉండివచ్చాను!" అన్నాను.

సుబ్రహ్మణ్యం వాడి పెళ్లాం భుజంతట్టి, ఆమె చెవిలో బిగ్గిరిగానే "రహస్యం! తెలిసిందా? నువ్వు వినకూడదు!" అన్నాడు. ఆమె మొగుడివంక తీవ్రంగా చూసివెళ్లిపోయింది.

"ఒరే! నాకు అర్జంటుగా పదిహేను రూపాయలు కావలిసి వచ్చాను. ఇస్తావా?" అన్నాను.

సుబ్రహ్మణ్యం శుభవార్త విన్నవాడల్లే పొంగి పోయి నన్ను కౌగలించుకుని జేబులోనించి మనీ పర్సుతీసి నాచేతులో పెట్టి కావలిసినంత తీసుకో మన్నాడు. దానిలో ఒక్కదమ్మిడీ కూడాలేదు.

సుబ్రహ్మణ్యానికి ఈమాట తెలియజేయటానికి చాలా కాలం పట్టింది. వాడు చాలా పశ్చాత్తాపం కనబరుస్తూ రేపువస్తే ఇస్తానని తెలియజేశాడు. నేను మా శివానందం వంక ప్రశ్నార్థకంగా చూశాను.

"రేపయినా ఫరవాలేదు!" అన్నాడు శివానందం.

సుబ్రహ్మణ్యం దగ్గిర శలవు తీసుకుని ఇద్దరమూ బయటికి వచ్చాం. గడప దగ్గిర మాకు సుభద్రమ్మ ఎదురుపడి ఒక్కమాట మాట్లాడి మరీ వెళ్లమన్నది. ముగ్గురమూ వంట ఇంట్లోకి వెళ్లాం.

నేను మా బావమరిదిని ఆవిడకు ఎరుక పరిచాను. ఆవిడ తన మొగుడి తాగుడు భాగోతం మొదలు పెట్టింది. శివానందం మాట అందుకున్నాడు. ఇద్దరూ ఎంత సేపటికీ తెగకుండా ఉపన్యాసాలు ప్రారంభించారు. ఒకరి మాట ఒకరు వినటంలేదు. ఆవిడ తన మొగుణ్ణి దూషించటమూ, మా వాడు తాగుడును దూషించటమూ, వాళ్లిద్దరూ నన్ను కూడా మరిచి పోయినారు.

కొంత సందుచేసుకుని నే నెక్కడో విన్న నాలుగు ముక్కలూ అన్నాను.

"తాగుడులో ఉన్న విశేషం ఒకటి చూశారో లేదో, తాగదగిన వాళ్లున్నారు, తాగదగని వాళ్లున్నారు. కొందరు తాగి పశువులై పోతారు. కొందర్ని తాగుడు పెద్ద మనుష్యులను చేస్తుంది. తాగినప్పుడు వాళ్లంత మంచివాళ్లు, అంత సుస్వభావులు ఉండరు. తాగుడు——"

మావాడూ సుభద్రమ్మగారూ నావంక ఒక్క క్షణం అర్థంలేని చూపులు చూసి వాళ్ల గోలలో వాళ్లు మాట్లాడటం మొదలు పెట్టారు. అందుకని నేను నా ఉపన్యాసం చాలించి మౌన ముద్రవహించాను.

చిట్ట చివరకు సుభద్రమ్మగారు అలిసిపోయి తన ఉపన్యాసం ఆపుదల చేసింది. మావాడు కూడా అలిసిపోయి చివర మాటల్లోకి వచ్చాడు.

"ఇదుగో చూడండి——మీ పేరేమిటో?——సుభద్రమ్మ గారూ? ఇక దాచటం ఎందుకూ? నేను సంఘ సంస్కర్తను. సంఘాన్ని ఇటువంటి దురాచారాలనించి రక్షించటం నావిధిగా నేను భావించుకున్నాను. సుబ్రహ్మణ్యాంగార్ని ఒక్కగంటలో తాగుడు మానేసేటట్టు చేసే పూచీ నాది!"

"బాబు! బాబు! ఆ పనిచెయ్యి, నాయనా! ఆపని చేస్తివా నీకెంతైనా పుణ్యాం ఉంటుంది. నేను చచ్చి నీకడుపున పుడతా!" అని సుభద్రమ్మగారు మావాడికి వరం ఇచ్చింది.

ఈ ఇద్దరూ ఒక తోవలోనే ఉన్నారని నాకు అనుమానం తోచింది.

"ఒక్కమాట అడగనా, సుభద్రమ్మా?" అన్నాను.

"ఏమిటి, నాయనా?"

"సుబ్రహ్మణ్యాం తాగివచ్చి ఏమైనా వెధవ వేషాలు వేస్తాడా?"

"అయ్యో! అడగాలా? ఇందాక మీ రిద్దరూ చూడలా?"

"చాలా ఆపేక్షగా ఉన్నట్టు కనపడ్డాడే!"

సుభద్రమ్మగారి మొహం సిగ్గుచేత ఎర్రబడ్డది.

"అయితే సరా?" అన్న దావిడ. "ఆ మాటలూ! ఆ తూలుడూ! రామ రామ! సాటివాళ్లలో తలఎత్తుకుని తిరగడానికి కూడా——"

మా శివానందం అందుకున్నాడు——

"నువ్వెప్పుడూ తప్పు దారి తొక్కమంటా వేమిటి? తాగుడు మనిషిని పశువునుగా మారుస్తుంది. ఏ కారణం వల్లగానీ తాగుడు మంచిదని వాదించటానికి బుద్ధికలవాడె వడూ పూనుకోడు. ఏమిటో మాట్లాడతా వేమిటి?"

"నా కెందుకు తేనిపోనిది! మీ యిష్టం!...మనం పోదాం పద!" అన్నాను.



మర్నాడు ఆదివారం. మా శివానందం నన్ను సుబ్రహ్మణ్యం గారింటికి బయలుదేరి తీశాడు. మావాడు ఉపన్యాసం ఇవ్వటానికి బయలుదేరుతున్నాడని తెలిసి, నేను కూడా ఎందుకన్నాను.

“ఆడబ్బు అడిగి తీసుకోవా ?” అన్నాడు.

సరే నేను కూడా బయలుదేరాను.

సుబ్రహ్మణ్యం అప్పుడే భోంచేసి కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటూ ఇంగ్లీషు వారపత్రిక పేజీలు తిరగవేస్తున్నాడు. మమ్మల్నిద్దర్నీ చెరొక కుర్చీలోనూ కూర్చోపెట్టాడు. వచ్చిన పని ఏమిటని అడిగాడు.

మా శివానందం గాడు గొంతు సవరించుకుని లేచి నిలబడి చొక్కాపై గుండీని సముదాయిస్తూ ఉపన్యాసం ప్రారంభించాడు. ఆ ఉపన్యాసం విపులంగా ఇక్కడ చెప్పను. శివానందం ఒక విషయం తీసుకుని ఒకటి వదిలిపెట్టాడనటానికి వీలులేదు. వాడు తాగుడును అన్ని వేపుల నించీ “ఎటాక్” చేశాడు. సుబ్రహ్మణ్యాన్నే తీసుకొన్నాడు. సుబ్రహ్మణ్యంతో, “అతను ఎంత ప్రజ్ఞావంతుడు ఎంత మేధావి, ఎంత దారిద్ర్యాన్నించి ఎంత హోదాలోకి వచ్చాడు!—ఈ విషయాలన్నీ గమనించమన్నాడు. ఈ దురభ్యాసం అతన్ని ఎంత హాస్యాస్పదుణ్ణి చేస్తున్నదో చూడమన్నాడు. ఇందువల్ల అతని భార్యారత్నంయొక్క వ్యక్తిత్వం ఎంత ఖేదిస్తున్నదో చూడమన్నాడు. మనం ఒకపాడు అలవాటుకు చిక్కిపోవటం కన్న శోచనీయమైన సంగతి ఉందా” అన్నాడు.

మా శివానందం మాట్లాడుతున్నంత సేపూ సుబ్రహ్మణ్యం వాడివంక విచిత్రంగా చూస్తూకూర్చుని, మావాడు కూచోగానే, “మీ అభిప్రాయం నాకు సరిగా భోధపడలేదు. నేను సరదాకు తాగుతాను. నాకు డబ్బు సమస్యలేదు. తాగితే నాకు ప్రపంచం స్వర్గంగానూ మనుష్యులంతా దేవతల్లేనూకనిపిస్తారు,” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“ఆ స్వర్గమూ, దేవతలూ అనేదంతా భ్రమ. మాయ. కల. మీరు సత్యాన్ని ఎదుర్కోవాలి. మీ భార్యారత్నం—”

“నా భార్యా రత్నం ఒక డాంఫూల్! దానికి మెదడు లేదు.”

“అది కాకా—మిమ్మల్ని ఈ దుర్వ్యసనం ఇంకా తుద ముట్టించలేదు. మీరింకా మొదట్లోనే ఉన్నారని మనవి చేస్తున్నాను.”

“నాకు తాగుడు అలవాటయి పోయిందని మీరు భావిస్తున్నట్టున్నారు. కావాలంటే నేను ఒక్క సంవత్సరం పాటు తాగకుండా ఉండగలను!”

శివానందం బిగ్గరిగా నవ్వాడు.

“ఉండగల ననుకుంటున్నారు! ఉండ గలిగితే ఎందుకు ఉండటం లేదూ?”

“అవసరం లేదు కనకా?”

“అదే అలవాటంటే.”

సుబ్రహ్మణ్యం మా వాడి వంక చిత్రంగా చూస్తూ “నా భార్య కోరినట్టయితే నేను ఒక్క సంవత్సరం పాటు తాగకుండా ఉంటాను,” అన్నాడు.

“ఆమాట మీదే ఉండండి!” అన్నాడు శివానందం.

మీపని అయిపోతే మీరు వెళ్లవచ్చునన్నట్టుచూశాడు సుబ్రహ్మణ్యం మా యిద్దరి వంకా, శివానందం నావంక చూశాడు.

“ఇంకొక్క పని ఉందిరా నీతో, సుబ్రహ్మణ్యం!” అన్నాను.

“ఏమిటది?”

“పది హేను రూపాయలు కావాలి! బదులివ్వగలవా?”

“పది హేను రూపాయలే! అర్జంటా? రేపుచూసి చెబుతాను!”

నేను శివానందం వంకచూసి, సుబ్రహ్మణ్యంతో, “సరేలే!” అన్నాను. ఇద్దరమూ బయటికి వచ్చాం.

“మళ్లీ వాయిదా వేశాడే!” అన్నాడు శివానందం. నేను మాట్లాడలేదు.

శివానందమూ నేనూ నాలుగయిదు రోజులు తిరిగాం సుబ్రహ్మణ్యంచుట్టూ. చివరకు సుబ్రహ్మణ్యం సౌఖ్యంగా “నాకు ఇప్పుడప్పుడే డబ్బువచ్చేటట్టులేదు. మరొకచోట చూసుకోరాదా?” అన్నాడు.

బయటికి వచ్చిన తరవాత శివానందం నామీద ఎగిరిపడ్డాడు.

“చేతులారా చేసుకున్నావు. అనుభవించు. సుబ్రహ్మణ్యం తాగుడు పూర్తిగా మానేశాడు!” అన్నాను.

తాగుడుకూ అప్పు ఇవ్వటానికీ ఏం సంబంధమని శివానందం తర్కించాడు. అర్థంచేసుకో లేక పోతే నోరు మూసుకోమని వాడికి సలహా ఇచ్చాను.

తరవాత ఒకటి రెండు రోజులకు సుభద్రమ్మ మాయింటికి వచ్చింది. ఆవిడ వాలకంచూస్తే ఏడుపు బలవంతాన నిగమింగుకుంటున్న దాని మాదిరిగా కనిపించింది.

"ఏమిటి విశేషాలు?" అని అడిగాను.

"ఈ పెద్ద మనిషి నాకొంపతీశాడు. మీ బావగారికి నామీద ఆపేక్షపోయింది. నావంక అమిత అసహ్యంగా చూస్తున్నారు. నేను తాగుడు మానమని బతిమాలానని ఆయనకు లోపల కోపంగా ఉంది."

"మీ కేమీ పరవాలేదండీ. అట్లా తెచ్చిపెట్టుకున్న కోపం ఎంతకాలం ఉంటుంది కనక? తాగుడు మానటం వల్ల కలిగే ఉపయోగం ఆయనకు మాత్రం ఎప్పటికైనా అవగతం కాదా?" అని భరవసా ఇచ్చాడు శివానందం.

ఆవిడ ఏమీ తృప్తి పడ్డట్టు కనిపించలేదు.

"ఇప్పుడైనా నామాట విను, సుభద్రమ్మా! నువ్వు ఇప్పుడే వెళ్లి నీ మొగుణ్ణి బతిమాలి తాగిరమ్మను. తెలిసిందా? అంతా సరి అయి ఊరుకుంటుంది," అన్నాను.

మావాడు వెనకనించి "ఛీ! ఛీ! ఓరి అప్రాచ్యుడా!" అంటున్నాడు. కాని సుభద్రమ్మ మొహం వికసించింది. ఆమె కళ్లుతుడుచుకుంటూ వెళ్లిపోయింది.

"ఏం సలహా ఇచ్చావు!" అన్నాడు శివానందం.

"నువు క్షమించి నోరుమూస్తావా? సుబ్రహ్మణ్యాన్ని నేను బాగా ఎరుగుదును. వాడు ఆడదాన్ని నెత్తినపెట్టుకునే రకం కాదు వస్తుతహా. తాగి ఉన్నప్పుడు పెళ్లాన్ని ఎంతో ఆపేక్షతో చూస్తాడు. ఆమెతో ఎంతో సరదాగా ఉంటాడు. నువుచెప్పు. ఆభార్య మొగుణ్ణి అందం చేత పరవశుణ్ణి చేస్తుందా, తెలివిచేత మెప్పించ గలుగుతుందా? ఆ పారవశ్యం తాగుడువల్ల వచ్చిన తరవాత ఆభార్యే వాడికి—వాడే అన్నట్టు—దేవతల్లే కనపడుతుంది. వాళ్లిద్దరికీ నువ్వు ఎడబాపులు చెయ్యవలసిన అవసరం ఏమిటో నాకు అర్థం కాదు."

"అట్లా పెళ్లాన్ని ప్రేమించటం తప్పంటాను. సత్యాన్ని ఎదుర్కోవాలి మనిషి అయిన వాడు!"

ఆ రాత్రి ఎనిమిది గంటలకు నేనూ మా శివానందం గాడూ భోంచెయ్యబోతుండగా సుబ్రహ్మణ్యం తూలుతూ వచ్చాడు.

"ఒరేయ్, బ్రదర్! ఇదుగో నువ్వడిగిన డబ్బు! నీ యిష్టంవచ్చినప్పుడు తిరిగి ఇయ్యి!" అని నా చేతుల్లో రెండు పది రూపాయల కాగితాలు పెట్టి నిష్క్రమించాడు సుబ్రహ్మణ్యం.

నేను మావాడూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నాం.

"వాడు తాగి ఉండకపోతే ఈడబ్బు ఇచ్చి ఉండడు. అట్లా డబ్బు తీసుకునే కన్న మానటం మంచి దంటాను. మనిషి అయిన వాడు సత్యాన్ని—"

శివానందం పెద్ద పెడబొబ్బపెట్టి నామీదికి లంఘించి నా చేతులలో నోట్లు ఊడలాక్కున్నాడు.

మన్మథ శాస్త్రము
ముఖ్యముగ అందఱు చదువవలసినది
వెల 8 అణాలు.
ది ఓరియంటల్ బుక్ డిపో




Madras Agents :— C. J. Sheth